రీచార్జ్ చేస్తేనే వెలుగులు!

- నియోజకవర్గంలో గృహాలకు స్మార్ట్ మీటర్లు
- బకాయిలు, విద్యుత్ చోరీ బాధ ఉండదంటున్న అధికారులు
- పేదలకు, గిరిజనులకు తప్పని కష్టాలు

నందికొట్కూరు: సెల్‌ఫోన్ ప్రీపెయిడ్ రీచార్జ్‌లాగా ఇకపై రీచార్జ్ చేసుకుంటునే ఇంట్లో విద్యుత్ వెలుగులు. మన ఖాతాలో డబ్బులు లేకపోతే వెంటనే కరెంట్ కట్ అవుతుంది. ఈ విధానం అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు తీసుకు రానున్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈ స్మార్ట్ మీటర్ల విధానంలో ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. అందులో బ్యాలెన్స్ ఉన్నంత వరకూ స్మార్ట్ మీటర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. రీచార్జ్ అయిపోతే చీకట్లో మగ్గాల్సిందే. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో ఈ విద్యుత్ మీటర్లు రూపొందించారు. సాధారణంగా నెలలో వినియోగించిన విద్యుత్ బిల్లు మరుసటి నెలకు చెల్లిస్తుంటారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎలాంటి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో వినియోగదారుడు బిల్లు చెల్లించడానికి నెల వరకూ సమయం ఉంటుంది. ఇంతవరకు అనుసరిస్తున్న ఈ విధానం వినియోగదారుడికి సౌకర్యంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ అధికారులు బిగించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జత చేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి.

అందుబాటులోకి యాప్

గతంలో మాన్యువల్ మీటర్లు ఉండేవి. వాటిని చూసి రీడింగ్ రాసుకునేవారు. ఇప్పుడు స్కాన్ రీడింగ్ చేసే ఆటోమెటిక్‌గా రికార్డు అవుతుంది. దీని ద్వారా వినియోగదారుడికి బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్లకు రీడింగ్ తీయాల్సిన అవసరం లేదు. మొబైల్ రీచార్జ్, డిష్ టీవీలకు రీచార్జ్ విధానంలోనే స్మార్ట్ మీటర్లకు రీచార్జ్ చేసుకోవాలి. ఇందుకు త్వరలో యాప్ అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. ఎంత విద్యుత్ వినియోగించుకున్నది సెల్‌ఫోన్‌లో బ్యాలెన్స్ ఎలా చూసుకుంటామో అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు

విద్యుత్ సంస్థను నమ్ముకుని ఎన్నో ఏళ్లగా మీటర్ రీడర్లు పని చేస్తున్నారు. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు జరిగితే వారందరి ఉపాధికి పెద్ద దెబ్బ.



స్మార్ట్ మీటర్

అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారుడు ఏ మాత్రం అలసత్వం వహించినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బకాయిల బాధ ఉండదని, విద్యుత్ చౌర్యం ఉండదని అధికారులు చెబుతున్నా విద్యుత్ స్తంభాల లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లతో పేదలపై భారం



ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై భారం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు ఇబ్బందులు ఏర్పడతాయి. ప్రీపెయిడ్ రీచార్జ్ ఆదివాసీలు వినియోగించుకోలేరు. దీని వల్ల చీకట్లో ఉండే పరిస్థితి ఏర్పడుతుంది.

–వెంకటేశ్వర్లు, సీపీఐ రైతు సంఘం, నందికొట్కూరు

బకాయిల బాధ ఉండదు



ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వంతు వచ్చింది. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో రూపొందించారు. సెల్‌ఫోన్, డిష్ టీవీలో ఎలా రీచార్జ్ చేసుకుంటారో అదే పద్ధతిలో స్మార్ట్ మీటర్లకు రీచార్జ్ చేసుకోవాలి. దీని వల్ల బకాయిల బాధ ఉండదు. విద్యుత్ చౌర్యం జరిగే అవకాశం ఉండదు.

–శ్రీనివాసులు, విద్యుత్ డీఈ, నందికొట్కూరు

ట్రాన్స్‌కో ఏఈ లేక ఇబ్బందులు

జూపాడుబంగ్లా: రెండు నెలల నుంచి జూపాడు బంగ్లా విద్యుత్ ఉపకేంద్రంలో ట్రాన్స్‌కో ఏఈ లేకపోవడం వల్ల రైతులు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ ఏఈగా విధులు నిర్వహిస్తున్న రామాచారి రెండు నెలల క్రితం కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆదోని కన్‌స్ట్రక్షన్స్ ఏఈ కృష్ణమూర్తిని జూపాడుబంగ్లా ఏఈగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటి వరకు విధుల్లో చేరకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గృహవిద్యుత్ కనెక్షన్లు, తదితర విషయాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుని జూపాడుబంగ్లాకు నూతన విద్యుత్ ఏఈని నియమించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

శ్రీశైలం వెళ్లిన అఘోరా

ఆత్మకూరు: మహిళా అఘోరా పట్టణం మీదుగా శ్రీశైల క్షేత్రానికి శనివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. స్థానిక బస్టాండ్, గౌడ్‌సెంటర్ తదితర కాలనీల వద్ద యువకులు అఘోరా వాహనాన్ని వెంబడిస్తూ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించేందుకు పోటీపడ్డారు. కాగా ఇప్పటికే అఘోరా మహానంది, యాగంటి తదితర పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ నేడు కర్నూలుకు చేరుకుని, కర్నూలు నుంచి రాత్రి ఆత్మకూరు మీదుగా శ్రీశైలానికి వెళ్లారు.

క్లుప్తంగా

ఉచిత న్యాయసేవలు పొందండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: న్యాయస్థానాల్లో పేదలు, మహిళలు ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆత్మకూరు కోర్టు భవనముల సముదాయంలో శనివారం జరిగిన లీగల్ లిటరసీ సమావేశంలో ఆయన మాట్లాడారు .అన్ని వర్గాల మహిళలు , సంవత్సరానికి రూ.3లక్షల లోపు ఆదాయమున్న ఇతరులు ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చని చెప్పారు. అలాగే వీలున్న కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా రాజీపడి కక్షిదారులు ప్రశాంత జీవనం పొందాలని సూచించారు. ఇందుకు పోలీసులు కృషి చేయాలని కోరారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌ల నియామకం



కోచ్‌లతో డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జమ్ముకాశ్మీర్‌లో జరిగే అండర్–14 బాలుర ఫెన్సింగ్ జాతీయ క్రీడల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్, మేనేజర్లను నియమించినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం తెలిపా రు. ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్‌గా మిడుతూరు మండలం చౌట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ ముస్తాహీర్, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లును నియమించినట్లు తెలిపారు. ఏపీకోచ్‌గా నియమితులైన వీరిద్దరిని స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ అభినందించారు.

చంద్ర పుల్లారెడ్డి త్యాగం మరవలేనిది



నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

నందికొట్కూరు: చంద్ర పుల్లారెడ్డి త్యాగాలు మరవలేనివని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నియోజకవర్గ కార్యదర్శి మజీద్‌మియ్యా అన్నారు. శనివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా ఉద్యమంలో ఆయన పోరాటాలను కొనియాడారు. పార్టీ నాయకులు ఆది, మౌలాలి, సామేలు, చూరు బీ, లక్ష్మీదేవి, మహబూబ్‌బాషా, గణేష్, జగదీష్, సువర్ణ, వెంకటమ్మ, శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరం ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లకాల్వ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అర్బన్ పోలీసులు భారీ నాటుసారా తయారీ కేంద్రాన్ని శనివారం ధ్వంసం చేశారు. స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి నేతృత్వంలో దాడి చేసి సారా బట్టీని ధ్వంసం చేసి మూడు డ్రమ్ముల్లో నిలువ ఉంచిన 750 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. దాడుల్లో ఆత్మకూరు అర్బన్ స్టేషన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా నిర్వాహకులు పరారయ్యారని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

దళితవాడలను అభివృద్ధి చేయాలి



పారుమంచాలలో రోడ్డుపై మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జూపాడుబంగ్లా: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో దళిత కాలనీలను అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కన్వీనర్ కర్ల, రంగస్వామి డిమాండ్ చేశారు. శనివారం పారుమంచాల గ్రామంలోని దళితకాలనీల్లో పర్యటించారు. సరైన రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం గుర్తించారు. పారుమంచాల, 80బన్నూరు తదితర గ్రామాల్లోని దళితులకు కనీసం శ్మశాన వాటికలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు నాగన్న, రమేష్, రాజేష్, ప్రసన్న, నాగరాజు, ప్రేమరాజు, దేవరాజు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో న్యాయ సేవల దినోత్సవం

కర్నూలు (లీగల్) : జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.ప్రతిభా దేవి మాట్లాడుతూ సమాజంలోని బలహీనవర్గాలకు చట్టపరమైన చర్యలు అందించడానికి జాతీయ న్యాయ సేవల దినోత్సవం తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకటహరినాథ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, ట్రైనీ న్యాయమూర్తులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాదులు, మధ్యవర్తులు, లా స్టూడెంట్స్, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభాదేవి

నేరాల అదుపులో ప్రభుత్వం విఫలం



ప్రజా పోరు వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: రాష్ట్రంలో బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, నేరాలు అధికమయ్యాయని.. అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం నేత నాగేశ్వరరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14వ తేదీ మండల కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజా పోరు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా కట్టడి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, ఉస్మాన్‌బాషా, నాగన్న, బాబు, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరుకు కదిలిరండి

ఆత్మకూరు: ప్రజాసమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజాపోరుకు కదిలి రండి అని సీపీఎం సీనియర్ నాయకుడు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహనాయక్ పిలుపునిచ్చారు. శనివారం ప్రజాపోరుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పాల్గొనాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, నిత్యావసర వస్తువుల రేట్లు ఆకాశానికి ఎగబాకుతున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. దీనికితోడు రూ.6072 కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపే ప్రయత్నం చేస్తోందన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఇళ్లకు బిగిస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉచిత ఇసుక మాటే గానీ, బంగారం కంటే విలువైనదిగా మారిందన్నారు. ఇక సూపర్ సిక్స్ హామీల అమలు అటకెక్కించారని విమర్శించారు. పల్లెల్లో పనులు ప్రజలు వలస వెళ్తున్నా చర్యలు శూన్యమన్నారు. వీటన్నింటి పరిష్కారం కోసం ప్రజాపోరు తలపెట్టామని చెప్పారు. ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, జి.నాగేశ్వరరావు, జబిబుల్లా, మహ్మద్, ఎ.కిరణ్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఓటరు నమోదుకు కానరాని బీఎల్‌ఓలు



జూపాడుబంగ్లా ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రానికి తాళం వేసివున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ప్రత్యేక ఓటరు నమోదుకు బీఎల్‌ఓలు అందుబాటులో లేకపోవడంతో మొక్కుబడిగా సాగుతోంది. శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బీఎల్‌ఓలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొత్తగా ఓటరు నమోదు, ఓటరు జాబితాలో పేర్లు, మార్పులు చేర్పులు చేసుకునే ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. జూపాడు బంగ్లాలో జంగాలపేట, క్వార్టర్స్ పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఉండగా ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓ విధులకు హాజరుకాలేదు. అలాగే కొన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్దకు రావాల్సిన బీఎల్‌ఓలు విధులకు హాజరుకాలేదనే విమర్శలున్నాయి. ఈ విషయమై డీటీలు మాట్లాడుతూ.. ప్రతి బీఎల్‌ఓ తప్పనిసరిగా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రం వద్ద ఉండాలని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా మొదటి రోజు కొత్త ఓటరు నమోదు కోసం ఆరు దరఖాస్తులు, మార్పుల కోసం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఏడాదిగా బీఎల్‌ఓలకు అందని గౌరవ వేతనం

బూత్‌లెవెల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వారికి ఏడాది కాలంగా గౌరవ వేతనం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఎల్‌ఓలుగా విధులు నిర్వహించే వారికి నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం గౌరవవేతనం మంజూరు చేస్తుంది. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలకు విడుదల చేసిన గౌరవ వేతనం నిధులు మళ్లీ ఇప్పటి దాకా మంజూరు చేయలేదంటున్నారు.

ఓటరు నమోదుకు స్పందన

నందికొట్కూరు: మండలంలో శనివారం నిర్వహించిన ఓటరు నమోదు స్పెషల్ క్యాంపునకు స్పందన లభించింది. ఓటు నమోదుకు–12 మంది దరఖాస్తు చేసుకోగా, ఫారం–7లో ఒకరు, ఫారం–8లో 9 మంది దరఖాస్తులు చేసునట్లు డిప్యూటీ తహసీల్దార్ కళావతి చెప్పారు. ఆదివారం సైతం ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపు ఉందని తెలిపారు.



పట్టణంలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం

ప్రత్యేక ఓటరు నమోదుకు 23 దరఖాస్తులు

బండిఆత్మకూరు: మండలంలో శనివారం ఏర్పాటు చేసిన వివిధ ప్రత్యేక ఓటరు శిబిరాల ద్వారా మొత్తం 23 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. కొత్తగా 14 మంది ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారని, ఏడుగురు సవరణ కోసం, రెండు ఓట్లు తొలగించుకున్నారని వివరించారు. శిబిరం ఆదివారం కూడా కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రేషన్‌బియ్యం పట్టివేత

–ఇద్దరిపై కేసు నమోదు

జూపాడుబంగ్లా: అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం వివరాలను వెల్లడించారు. వెలుగోడుకు చెందిన కుమ్మరి లక్ష్మీదేవి, పవన్ పారుమంచాల గ్రామంలో రేషన్‌కార్డుదారుల నుంచి 450 కిలోల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. వాటిని కర్నూలు పట్టణానికి తరలించేందుకు యత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. తొమ్మిది సంచుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌బీ కానిస్టేబుల్‌పై వేటు?

నందికొట్కూరు: ప్రజలతోపాటు సొంత శాఖ అధికారుల ఫిర్యాదులతోనే స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ మురహరిప్రతాప్‌పై వేటు పడినట్లు సమాచారం. అందులోభాగంగానే ఈనెల 8న జిల్లా ఎస్పీ కార్యాలయంలో అతడు రిపోర్ట్ చేసుకున్నారు. 2013 నుంచి 2018 వరకు కానిస్టేబుల్‌గా ముచ్చుమర్రి, నందికొట్కూరు పోలీసు స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహించాడు. 2018 నుంచి 2023 వరకు ఇంటెలిజెన్స్, 2024 నుంచి స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్నాడు. 11 ఏళ్లుగా నందికొట్కూరు సర్కిల్‌లోనే ఉంటూ ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వ ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఇటీవల ఆదేశించినట్లు సమాచారం.

అందరికీ న్యాయం అందితేనే సమానత్వం

ఆళ్లగడ్డ : అందరికీ న్యాయం అందితేనే సమానత్వం సాకారమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి శైలజ పేర్కొన్నారు. న్యాయ సేవల దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ ప్రత్యేకమైన వివాదాలు పరిష్కరిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. పేదలకు ఉచితంగా న్యాయం అందించడమే న్యాయసేవాధికార ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని చైతన్యవంతం కావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చిరంజీవి, ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

11 నుంచి ధార్మిక ప్రవచన సప్తాహం

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక మాసం విశిష్టతపై ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు ధార్మిక ప్రవచన సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డలోని శ్రీ అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో ధార్మిక ప్రవచకులచే ధార్మిక ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1 పండితులు విరివింటి ఫణి శశాంక శర్మ, రాంభూపాల్‌రెడ్డి, వెంకట కృష్ణయ్య, గోవిందరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: కార్తీక మాసం శనివారం సందర్భంగా మండల కేంద్రంలోని పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు.



పల్లకీపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వెయ్యిమంది పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ పాత స్నేహితులను కలుసుకొని కాలేజీ రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 1960 నుంచి 2024 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశ్వాసానికి నిదర్శనమన్నారు.

పకడ్బందీగా పశుగణన

పగిద్యాల: జనాభా లెక్కల మాదిరిగానే పశు గణనను పకడ్బందీగా చేపడుతున్నామని పాత ముచ్చుమర్రి పశుగణాభివృద్ధి డిస్పెన్సరీ పశువైద్యురాలు రాగసంధ్య తెలిపారు. శనివారం మండలంలోని పాత ముచ్చుమర్రిలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 21వ పశు గణన కార్యక్రమం అక్టోబర్ 25వ తేదీ నుంచి ప్రారంభమైందని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరికి ముగుస్తుందన్నారు. మండలంలోని పగిద్యాల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట గ్రామాల్లోని పశుగణాభివృద్ధి కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సమాచార సేకరణకు ఎన్యుమరేటర్లుగా ఇంటింటికి వస్తున్నట్లు వెల్లడించారు. ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు కచ్చితమైన సమాచారం అందించాలని కోరారు. వ్యవసాయం రంగంపై మనిషి జీవన విధానం ఆధారపడి ఉందన్నారు. అందువల్ల పశు సంపద వివరాలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పశుగణన సర్వేకు సహకరించాలని కోరారు.



వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్ చరిత, పశువైద్యురాలు రాగసంధ్య

అలగనూరు రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి



జీపు జాత నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

మిడుతూరు: అలగనూరు రిజర్వాయర్ గండి నిర్మాణం పూర్తి చేసి రైతాంగానికి సాగునీరందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, జిల్లా సమితి సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మిడుతూరు, గడివేముల మండలాల పరిధిలోని గ్రామాల్లో జీపు జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలగనూరు రిజర్వాయర్ గండి నిర్మాణం చేపట్టకుండా నాలుగు సంవత్సరాలు దాటిందని.. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి రిజర్వాయర్ గండికి మరమ్మతులు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా నందికొట్కూరు పట్టణానికి రిజర్వాయర్ ద్వారా తాగు నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెద్ద రాముడు, అబ్రహం, సోమన్న, బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో దేవదాయశాఖ మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రికి ఆలయ రాజగోపురం వద్ద కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో మంత్రికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. కమిషనర్ స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



మంత్రి ఆనంకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ప్రత్యేక అధికారి

జూపాడుబంగ్లా ఆధార్‌కేంద్రంలో సేవలు బంద్

- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జూపాడుబంగ్లా: విద్యార్థుల సౌలభ్యం కోసం కలెక్టర్ ఆధార్‌కేంద్రాలు లేని చోట కేంద్రాలను ఏర్పాటు చేయిస్తుంగా మండల కేంద్రమైన జూపాడుబంగ్లా–1 సచివాలయంలో మాత్రం ఆధార్‌కేంద్రం సేవలు బంద్ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా మండలం వ్యాప్తంగా మండ్లెం–1, జూపాడుబంగ్లా–1 సచివాలయాల్లో రెండు ఆధార్ సెంటర్లు ఉన్నాయి. వాటిల్లో మండ్లెం–1 సచివాలయంలో ఆధార్ పరికరాలు మూడు నెలల క్రితం మరమ్మతులకు గురవడంతో అధికారులు నేటికీ పరికరాలకు మరమ్మతులు చేయించలేదు. దీంతో ఆధార్‌సేవలునిలిచిపోయాయి. మండలం మొత్తానికి జూపాడుబంగ్లా–1 సచివాలయంలోని ఆధార్‌సెంటర్ దిక్కైంది. సచివాలయంలో ఆధార్‌సేవలను అందించే డిజిటల్ అసిస్టెంటు రాముడు సమగ్ర కుటుంబ సర్వే నిమిత్తం ఎంపీడీఓ అధికారులు నియమించారు. దీంతో ఆయన ఆధార్‌సేవలను నిలిపివేసి సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొంటున్నారు. ఉన్న ఒక్క ఆధార్‌కేంద్రంలో సేవలు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలం వ్యాప్తంగా ఉన్న 38 పాఠశాలల్లోని 4,830మంది విద్యార్థుల పేర్లు అపార్‌లో ఎంటర్ చేస్తున్నారు. పాతశాల రికార్డులు, ఆధార్‌కార్డుల్లో అక్షరం తప్పు లేకుండా ఒకే విధంగా ఉంటేనే అపార్‌లో పేర్లు నమోదవుతున్నాయి. ఒక్క అక్షరం తప్పుగా ఉన్నా పేర్లు నమోదు కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలు, తహసీల్దార్, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే జూపాడుబంగ్లా ఆధార్‌కేంద్రంలో సేవలు అందేలా చేయాలని కోరుతున్నారు.



ఆధార్‌సేవలు బంద్ అయిన జూపాడుబంగ్లా–1 సచివాలయం